క్లుప్తంగా

వైద్య విద్యార్థికి ఆర్థిక సాయం



హుమైరాకు ఆర్థిక సాయం అందిస్తున్న సమితి సభ్యులు

బోట్‌క్లబ్: చదువులో ప్రతిభ కనబర్చి ఎంబీబీఎస్ ఉచిత సీటు సాధించిన విద్యార్థికి కాకినాడ సేన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు హసన్ షరీఫ్ అండగా నిలిచారు. నగరానికి చెందిన హుమైరా ఎంబీబీఎస్ చదువుతోంది. ఆమె తండ్రి మరణించినా, తల్లి కష్టపడి చదివించడంతో ఆమె ఉచిత సీటు సాధించింది. ఆమెను చదివించేందుకు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న సమితి ఆమెకు రూ.35 వేలు ఆర్థిక సాయాన్ని మంగళవారం అందించారు. ఆసరా, మేవా, మా లాంటి పలు సంస్థలు ముందుకు వచ్చి ఆమె చదువుకో కొండంత భరోసా ఇచ్చారు. సమితి సభ్యులు సయ్యద్ హుస్సేన్, అజర్, మౌలానా, ఆలీ, నసీర్ పాల్గొన్నారు.

తమ్మవరంలో పశువైద్య శిబిరం



పశు వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న జేడీ కృష్ణమూర్తి తదితరులు

కాకినాడ రూరల్: మండలంలోని తమ్మవరం గ్రామంలో మంగళవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో గ్రామంలోని 46 గేదెలు, 28 ఆవులకు వైద్య సేవలను అందించారు. వైద్య శిబిరాన్ని పశు సంవర్ధక శాఖ జేడీ డాక్టర్ కృష్ణమూర్తి ప్రారంభించిన అనంతరం పాడి రైతులకు పశువుల లింగ నిర్ధారణ, వీర్యం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు కొండలరావు, అంబేడ్కర్, సురేష్‌బాబు, కళ్యాణి, రాజ్యలక్ష్మి, సర్పంచ్ గొల్లపల్లి రామస్వామి, పంచాయతీ కార్యదర్శి వెంకటరత్నం, గ్రామస్తులు గొల్లపల్లి వెంకటరమణ, బాబీ, వీరబాబు, త్రిమూర్తులు, మాజీ సర్పంచ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయంలో భద్రత అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న కాకినాడ ఆర్డీఓ మల్లిబాబు

బోట్‌క్లబ్: దీపావళి బాణసంచా విక్రయంలో భద్రతా చర్యలు పాటించాలని ఆర్డీఓ ఎస్ మల్లిబాబు అన్నారు. తాత్కాలిక బాణసంచా తయారీదారులు, అమ్మకందారులతో మంగళవారం ఆర్డీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అమ్మకందార్లు నిర్దేశించిన పరిమాణంలో మాత్రమే విక్రయ కేంద్రాల్లో నిల్వ చేసుకోవాలన్నారు. వాటి వద్ద భద్రతా ప్రమాణాలు పాటించాలని పేర్కొన్నారు. విక్రయ ప్రదేశాల్లో ఫస్ట్ ఎయిడ్, ఫైర్ సేఫ్టీ పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పేలుడు పదార్థాల రవాణా విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏదైనా ప్రమాదాలు జరిగినా, ప్రాణ నష్టం జరిగినా క్రిమినల్, సివిల్ చర్యలకు తయారీదారులు బాధ్యత వహించాలన్నారు. లైసెన్స్ పొందిన తర్వాత మాత్రమే దీపావళి సామాన్లు నిల్వ ఉంచాలని, లైసెన్స్ పొందకుండా నిల్వ ఉంచితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కాకినాడ డివిజన్‌లోని తహసీల్దార్లు, సీఐలు, డివిజనల్ ఫైర్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ముద్దనపై చర్యలు తీసుకోవాలి

కాకినాడ రూరల్: సర్పవరం గ్రామానికి చెందిన జనసేన నాయకుడు ముద్దన సూర్య ప్రకాష్‌పై చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ కుమారి, సర్పవరం సీఐ పెద్దిరాజుకు ఆ గ్రామ దళితులు మంగళవారం ఫిర్యాదు చేశారు. సర్పవరం గ్రామానికి చెందిన సవరం చిట్టిబాబు ఆధ్వర్యంలో వల్లూరి నాని, గర్బాపు బాబీ, పలివెల రవి, దాసు మల్లెల, సవరం చిన్నా, అశోక్, నాని, శివ, దానయ్య తదితరులు దళితుల పట్ల ప్రకాష్ వివక్ష పూరితంగా మాట్లాడి అవమానించారని పేర్కొన్నారు. శ్మశాన వాటికకు వెళ్లే దళితులకు వేరే వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేయాలని కించ పరిచేలా మాట్లాడడం దారణమని దీనిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు.

భార్య వదలి వెళ్లిందని ఆత్మహత్య

కాకినాడ రూరల్: తన భార్య వదలి వెళ్లిపోయిందని మనస్తాపానికి గురై ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంద్రపాలెం పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని తూరంగి పగడాలపేటకు చెందిన పెమ్మాడి శ్రీనివాస్ (38) వడ్రంగి పని చేస్తుంటాడు. అతడికి భార్య కన్యాకుమారి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య భర్తల మధ్య తరచూ మనస్పర్థలు వస్తుండేవి. ఈ నేపథ్యంలో ఆమె తన ఇద్దరు పిల్లలను తీసుకుని పని వెతుక్కుంటూ మహారాష్ట్రకు వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన శ్రీనివాస్ ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటి నుంచి దుర్గంధం రావడంతో స్థానికుల సమాచారం మేరకు ఇంద్రపాలెం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా శ్రీనివాస్ ఉరి వేసుకుని మృతి చెందినట్టు గుర్తించారు. రెండు రోజులు క్రితమే మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుడి సోదరుడు కనకదుర్గా ప్రసాద్ ఫిర్యాదు మేరకు ఎస్సై ఎం.వీరబాబు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి మదిపై పోస్టల్ స్టాంప్

- నేడు, రేపు స్టాంపుల సేకరణ, ప్రదర్శన పోటీలు
- తపాలాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి

బాలాజీచెరువు: నేటి తరానికి తపాలాశాఖ అంటే అంతగా అవగాహన లేదు. మారిన డిజిటల్ యుగంలో అంతా అన్‌లైన్ సేవలు, టెక్నాలజీ రావడమే ఇందుకు కారణంగా చెప్పవచ్చు. ఇటువంటి తరుణంలో నేటి యువత, ముఖ్యంగా విద్యార్థులకు తపాలాశాఖ సేవలు వివరించాలనే ఉద్దేశంతో ఏటా కొత్త కార్యక్రమంతో ముందుకు వస్తున్నారు. గత ఏడాది థాయ్ ఆఖర్ పేరుతో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి ఉత్తరాల ప్రాధాన్యాన్ని వివరించగా తాజాగా ఈ ఏడాది ఫిలాటెలీ ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నారు. ఏదైనా చూడగానే ఆకట్టుకునే స్టాంపులను సేకరించే ఫిలాటెలిస్టులు చాలా మందే ఉంటారు. అటువంటి వారిని ప్రోత్సహించి వారి ప్రతిభను ప్రతి ఒక్కరికీ తెలియజేయాలన్న ఉద్దేశంతో ఆ శాఖ ఆధ్వర్యంలో బుధ, గురువారాల్లో ఫిలాటెలీ ప్రదర్శన, పోటీలు నిర్వహిస్తున్నారు. వీటికి సినిమా రోడ్డులో గత సూర్యకళా మందిరం వేదికగా నిలవనుంది. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ ప్రదర్శన నిర్వహించనున్నారు.

విద్యార్థులు, ప్రజలను ప్రోత్సహించడానికే..

విద్యార్థులు, జిల్లా ప్రజల్లో దాగున్న స్టాంపుల సేకరణ (ఫిలాటెలి) అభిరుచిని ప్రోత్సహించడం, స్టాంపుల ద్వారా మన దేశ సంస్కృతి, వారసత్వం, చరిత్ర, జంతుజాలం, ప్రకృతి వంటి అనేక విషయాలపై మరింత అవగాహన పెంచే దిశగా ఈ పోటీ, ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్టు తపాలా అధికారులు పేర్కొంటున్నారు. చిత్రలేఖనం, లెటర్ రైటింగ్, క్విజ్ పోటీలు జరుగుతాయని, జిల్లా వ్యాప్తంగా ఆసక్తి ఉన్న పాఠశాలల విద్యార్థులు నేరుగా సూర్యకళామదిరానికి హాజరై పోటీల్లో పాల్గొనవచ్చు. స్టాంపుల సేకరణకర్తలకు ప్రత్యేకంగా ప్రదర్శన ఏర్పాటు చేయించి వారితో అత్యుత్తమైన వాటిని కలిగి ఉన్న వారికి ప్రత్యేక బహుమతులు అందజేస్తారు.



సూర్యకళా మందిరంలో స్టాంపుల ప్రదర్శనకు ఏర్పాట్లు



సూర్యకళా మందిరంలో ఏర్పాటు చేసిన వేదిక

మై స్టాంప్ కౌంటర్లు

ప్రదర్శనలో భాగంగా ప్రత్యేక మై స్టాంప్ కౌంటర్, ఫిలాటెలీ కౌంటర్లు ఏర్పాటు చేస్తారు. మై స్టాంపు ద్వారా ప్రజలు, విద్యార్థులు వారి ఫొటోలతో కూడిన ఇష్టమైన చిత్రాలతో కూడిన స్టాంపులను ముద్రించుకునే అవకాశం ఉంది. దేశంలో ఉపయోగించే స్టాండర్డ్ పోస్టేజ్ స్టాంపులతో వీటిని ముద్రిస్తారు. జిల్లాలో ప్రముఖ ప్రాంతాలు, వ్యక్తులకు సంబంధించిన ప్రత్యేక తపాలా కవర్లను విడుదల చేసే కార్యక్రమాన్ని ఇందులో పొందుపరచారు. ఆసక్తి ఉన్న వారంతా పోటీలు, ప్రదర్శనలో పాల్గొని తమ ప్రతిభ చూపించి, బహుమతులు గెలుచుకోవచ్చు.

ప్రవేశం ఉచితం



తపాలాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలను అన్ని వర్గాల వారు విద్యార్థులు, యువత, నగర వాసులు పాల్గొని తిలకించవచ్చు. ఇప్పటికే అన్ని విద్యాసంస్థలు, ముఖ్య కార్యాలయాల్లో ప్రచారం కల్పించాం. ముగింపు రోజున ప్రతిభ చూపిన వారికి జేఎన్‌టీయూకే వీసీ ప్రసాద్, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా బహుమతులు అందజేస్తాం.

– కె.కృష్ణ, పోస్టల్ సూపరింటెండెంట్, కాకినాడ

ఫిలాటెలీ ప్రదర్శనను ప్రోత్సహించాలి

నగరంలో చాలా రోజుల తరువాత ఇటువంటి ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యంగా నేటి కాలం యువత పోస్టల్‌శాఖ అనాడు అందించిన సేవలు తెలుసుకోవలసిన అవశ్యకత ఎంతైనా ఉంది. అలాగే ఫిలాటెలీ ప్రదర్శన ఏర్పాటు చేసి స్టాంపుల సేకరణపై ఆసక్తి కలిగించడానికి వేదిక ఏర్పాటు చేశారు. ఇటువంటి వాటిని ప్రతి ఒక్కరూ సందర్శించి ప్రోత్సహించాలి.

– సురభి శారద, రోటరీ అసిస్టెంట్ గవర్నర్, కాకినాడ

టౌన్‌హాల్ సభ్యుల బాధ్యతల స్వీకరణ



గాంధీజీ విగ్రహం వద్ద బాధ్యతలు స్వీకరించిన టౌన్‌హాల్ కమిటీ సభ్యులు

బోట్‌క్లబ్: లిటరరీ అసోసియేషన్ (టౌన్‌హాల్) నూతన కార్యవర్గం సభ్యులు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా టౌన్ హాల్ ప్రాంగణంలో ఉన్న పాలరాతి గాంధీజీ విగ్రహానికి నూతన సభ్యులు భక్త్యాంజలి ఘటించారు. టౌన్ హాల్ కమిటీ అధ్యక్షుడు ఆనంద్ మాట్లాడుతూ గాంధీజీ వంటి మహానుభావులు నడయాడిన ప్రాంతం లిటరరీ అసోసియేషన్ ప్రాంగణమని ఆయన గుర్తు చేశారు. సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడమే కాక విద్యాభివృద్ధికి స్కాలర్‌షిప్‌ల రూపంలో విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులు డీవీఎస్ రాజు, సంయుక్త కార్యదర్శి వైవీఎస్ నాయుడు, కోశాధికారి నెక్కంటి శ్రీనివాస్, సభ్యులు బచ్చు శేఖర్, ఇంద్రల్, దంగేటి ప్రసాద్, వేపకాయ రామకృష్ణ పాల్గొన్నారు.

సీజేఐపై దాడి రాజ్యాంగ ధిక్కరణే



కాకినాడ బార్ అసోసియేషన్ వద్ద విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

కాకినాడ లీగల్: భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడి భారత రాజ్యాంగంపై జరిగిన దాడిగానే భావిస్తున్నామని కాకినాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలూరు సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. దాడిని నిరసిస్తూ మంగళవారం స్థానిక బార్ అసోసియేషన్ న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ నిందితున్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ దాడి న్యాయ వ్యవస్థపై జరిగినట్టేనని ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు టి.పృధ్వీరాజ్ అన్నారు. బార్ అసోసియేషన్ వద్ద న్యాయవాదులు నిరసన అనంతరం జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాకు వినత పత్రం సమర్పించారు. అలాగే సీజేఐపై దాడిని రాష్ట్ర ఆల్ ఇండియన్ లాయర్స్ యూనియన్ (ఐలు) ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మేడపాటి ధర్మారెడ్డి ఓ ప్రకటనలో ఖండించారు.

24న ఏఐ వృత్తి నైపుణ్యంపై సాంకేతిక సదస్సు



వృత్తి నైపుణ్య సాంకేతిక సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): కాకినాడ గోదావరి కళాక్షేత్రంలో ఈ నెల 24వ తేదీన ఉదయం 9 గంటల నుంచి ఏఐ ఫిజియన్ పేరుతో ఒక సాంకేతిక సదస్సు నిర్వహిస్తున్నామని ఏపీ డిజిటల్ టెక్నాలజీ నెట్‌వర్క్ కన్వీనర్ కొసరాజు శ్రీధర్ తెలిపారు. మంగళవారం స్థానికంగా ఓ హోటల్లో నిర్వహించిన సమావేశంలో ఆ వివరాలను విలేకరులకు తెలిపారు. ప్రస్తుతం ప్రపంచం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతిక రంగంలో ఉందని దీనివల్ల అన్ని రంగాలలో విప్లవత్మకంగా అనేక మార్పులు వస్తున్నాయన్నారు. వాటిని వివరించే నిమిత్తం ఈ సదస్సును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను ఆహ్వానించామని చెప్పారు. భవిష్యత్ అంతా ఏఐ దేనని దీనికి సంబంధించి వివిధ కంపెనీలైన గూగుల్, బాష్, టీసీఎస్, అమెజాన్, మైక్రోసాఫ్ట్ వంటి సంస్థలకు చెందిన ప్రతినిధులు సదస్సులో పాల్గొంటారాన్నరు. గోదావరి ప్రాంతంలో సుమారుగా ఐటి రంగానికి చెందిన వారు 50 వేల మంది వరకు ఇంటి వద్ద ఉండి తమ ఉద్యోగ విధులు నిర్వహిస్తున్నారని వీరికి ఇటువంటి సదస్సులు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఏఐ వల్ల ఆరోగ్య, సాంకేతిక, పారిశ్రామిక రంగాల్లో వస్తున్న మార్పులను వివరిస్తారన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో నాలుగో అంతర్జాతీయ ఇంపాక్ట్ సదస్సు ఢిల్లీలో జరుగుతుందని దానికి అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు శ్రీధర్ చెప్పారు. అనంతరం దీనికి సంబంధించిన పోస్టర్ జెడ్పీ సమావేశ మందిరం వద్ద జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీ ఐటీ మాజీ చైర్మన్ అళ్ల నాగరాజు, ఏపీ టీడీఏ నెట్‌వర్క్ కన్వీనర్ ఆకారపు కుమార్, కైట్ హెడ్ రావిపాటి సురేఖరావు పాల్గొన్నారు.

పర్యాటకాభివృద్ధికి కృషి

కాకినాడ రూరల్: జిల్లాను పర్యటకంగా అభివృద్ధి చేస్తున్నామని, ఇందులో భాగంగా సూర్యారావుపేట న్యూ ఎన్టీఆర్ బీచ్‌లో బీచ్ పార్కు, బీచ్ ఫ్రంట్ అభివృద్ధి చేసినట్టు ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ పేర్కొన్నారు. కొడా నిధులతో గత ప్రభుత్వంలో యుద్ధ విమాన మ్యూజియం, బీచ్ పార్కు ఏర్పాటు చేయగా ప్రస్తుతం బీచ్ ఫ్రంట్ అభివృద్ధి పనులు, ఈట్ స్ట్రీట్ పనులకు మంగళవారం కొడా చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు), ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్సీలు పేరాబత్తులు రాజశేఖర్, కర్రి పద్మశ్రీ, రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ప్రారంభించారు. యుద్ధ విమాన మ్యూజియంను వారు సందర్శించి, బీచ్ ఫ్రంట్‌లో ఏర్పాటు చేసిన యుద్ధ ట్యాంకర్‌ను ప్రారంభించారు. కొడా చైర్మన్ రామస్వామి మాట్లాడుతూ కొడా నిధులు 4.58 కోట్లుతో బీచ్ ఫ్రంట్ అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కొడా వీసీ, జాయింట్ కలెక్టరు రాహుల్ మీనా, కొడా సెక్రటరీ కాశీబాబు, డీఈ రామారావు, ఏఈ శ్రీనివాస్, ఏపీఓ శివరామకృష్ణ, ఎంపీపీ అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కాకినాడ సూర్యారావుపేట బీచ్‌లో బీచ్ ఫ్రంట్, ఈట్ స్ట్రీట్ ప్రారంభోత్సవంలో ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తదితరులు

డ్వాక్రా సొమ్ము దుర్వినియోగంపై విచారణ జరపాలి

జెడ్పీటీసీ సభ్యుడి ఫిర్యాదు

కరప: కూరాడ గ్రామంలో మహిళాశక్తి సంఘాల (డ్వాక్రా గ్రూపులు) సొమ్ము రూ.కోటి దుర్వినియోగమైనా ఎవరూ పట్టించుకోవడం లేదని, దీనిపై సమగ్రంగా విచారణ జరపాలని జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు కోరారు. అలాగే ఆయా సంఘాలకు మంజూరయ్యే మొత్తాల్లో యానిమేటర్లు రూ.50 వేల వంతున వసూలు చేస్తున్న విషయంపైనా దృష్టి సారించి అవినీతికి అడ్డుకట్ట వేయాలని ఆయన కలెక్టర్ షణ్మోహన్‌కు వినతి పత్రం అందజేశారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన సర్వ సభ్య సమావేశంలో సుబ్బారావు మాట్లాడుతూ గ్రామాల్లో మహిళాశక్తి సంఘాలకు జరుగుతున్న అన్యాయాన్ని, ఎస్‌బీఐ బ్రాంచ్ సీసీ, యానిమేటర్ల దోపిడీని వివరించారు. కూరాడ గ్రామానికి చెందిన చిన్నం భారతి ఎస్‌బీఐ బ్రాంచ్ సీసీ పాయింట్ నిర్వహిస్తూ డ్వాక్రా సభ్యుల నుంచి పొదుపు, వాయిదాల సొమ్ము వసూలు చేస్తూ, వాటిని సభ్యుల ఖాతాలో జమచేయకుండా 76 సంఘాల నుంచి సుమారుగా రూ. కోటి వ్యక్తిగత అవసరాలకు వాడుకున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. కలెక్టర్ షణ్మోహన్ స్పందించి మహిళాశక్తి సంఘాలలో జరుగుతున్న అక్రమాలు తన దృష్టికి వచ్చాయని, నాలుగైదు రోజుల్లో చర్యలు తీసుకుంటామని చెప్పినట్టు జెడ్పీటీసీ స్థానిక విలేకరులకు వివరించారు.



జెడ్పీ సమావేశంలో కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న జెడ్పీటీసీ సుబ్బారావు

ప్రకృతి పరిరక్షణకు చైతన్యం అవసరం

జిల్లా అటవీ అధికారి రామచంద్రరావు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జాతీయ వన్య ప్రాణి వారోత్సవం–2025 సందర్భంగా ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ జిల్లా శాఖ ఆధ్వర్యంలో వివేకానంద పార్క్‌లోని శాఖా గ్రంథాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అటవీ అధికారి ఎన్. రామచంద్రరావు హాజరై మాట్లాడుతూ వన్యప్రాణులు ప్రకృతి సమతౌల్యాన్ని కాపాడతాయని, వాటిని కాపాడకపోతే మన భవిష్యత్తు సురక్షితం కాదని అన్నారు. పాఠశాల స్థాయిలోనే పర్యావరణం పట్ల చైతన్యం పెంచడం అత్యవసరమని, ప్రతి విద్యార్థి ఒక చెట్టు నాటడం, ఒక ప్రాణిని కాపాడే మనసు కలిగి ఉండడం అవసరమని సూచించారు. విద్యార్థులలో పర్యావరణ పరిరక్షణపై ఆసక్తి పెరగడం హర్షణీయన్నారు. కోరంగి వన్యప్రాణి అభయారణ్య ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ మాట్లాడుతూ అటవీ సంపద కేవలం ప్రభుత్వ సొత్తు కాదని ప్రజల ఆస్తి అని వన్యప్రాణులను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ పర్యావరణ అవగాహన కార్యక్రమాలు పాఠశాలల్లో నిరంతరం కొనసాగాలని, విద్యార్థుల ప్రతిభ ఎంతో ప్రశంసనీయం అని తెలిపారు. శాఖా గ్రంథాలయ పరిపాలనాధికారి ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రంథాలయాలు జ్ఞాన కేంద్రాలే కాకుండా పర్యావరణ చైతన్య వేదికలుగా మారాలని అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలలో జిల్లాలోని 84 పాఠశాలలు, కళాశాలల నుంచి 628 మంది విద్యార్థులు పాల్గొని తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. కార్యక్రమంలో అటవీ అధికారులు ఎం.నాగార్జున, వీరభద్రరావు, సిద్ధార్థ, ఉపాధ్యాయులు ఎస్.చలపతి, వి.శ్రీనివాస్, విద్యార్థులు, తల్లితండ్రులు, పర్యావరణ ప్రేమికులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా అటవీ శాఖాధికారి రామచంద్రరావు

ఆశకు లోనుకావొద్దు..

- హామీ లేని రుణాలంటూ ప్రలోభాలు
- దానికి చిక్కితే ప్రాణాలకే ముప్పు
- యువతే లక్ష్యంగా యాప్‌ల వల
- అప్రమత్తం అంటున్న పోలీసులు

కొత్తపల్లి: ఏ పని చేసినా కీడెంచి మేలెంచాలంటారు. పెద్దలు ఏనాడో చెప్పిన మాటలు ఈనాడు నిజమనిపిస్తున్నాయి. సాంకేతిక విప్లవం కొన్ని సందర్భాలలో దారి తప్పుతోంది. అర చేతిలో వైకుంఠం చూపిస్తున్న మొబైల్ సాంకేతికత అదే చేతితో ప్రాణాలను సైతం బలి తీసుకుంటోంది. ప్రజల అవసరాలను ఆసరాగా తీసుకుని లోన్ యాప్‌ల నిర్వాహకులు పేట్రేగిపోతున్నారు. మండలంలో పలువురు బాధితులు బయటకు చెప్పలేక ఇబ్బంది పడే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. వారి వలలో పడి యాప్‌ల ద్వారా రుణాలు తీసుకున్న అమాయక యువకులు వాటిని చెల్లించినా వేధింపులు తాళలేక బలవంతంగా తనువు చాలిస్తున్నారు. మీరు రుణం తీసుకోవడానికి ఎంపిక య్యారు అంటూ ఫోన్‌లు చేసి యువతకు వల వేస్తున్నారు. చూద్దాంలే అని చెపితే చాలు తీసుకునేవరకూ ఫోన్ చేసి ఎలాగోలా ఒప్పించి రుణాన్ని తీసుకునేందుకు మభ్యపెడుతున్నారు. తీరా యాప్ ద్వారా రుణం తీసుకుంటే వడ్డీపై వడ్డీ వేసి తీసుకున్న లోన్ నుంచే ముందుగానే కొంత సొమ్ము మినహాయించుకుంటున్నారని గగ్గోలు పెడుతున్నారు.

ఒక్క క్లిక్‌తో..

మీ మొబైల్ ఫోన్‌లో ఒకే ఒక క్లిక్‌తో యాప్ డౌన్‌లోన్ చేసుకోండి హామీ లేకుండా రుణం పొందండి అంటూ లోన్ యాప్ నిర్వాహకులు ఇచ్చే ప్రకటనలు. ఎటువంటి హామీ లేదనడంతో మధ్య తరగతి వారు ఈ మాటలకు ఆకర్షితులవుతున్నారు. ఇదే వారి పాలిట యమపాశం అవుతోంది.

వేధింపులు

రుణం తీసుకున్న రోజు నుంచే చెల్లింపుల కోసం నిర్వాహకులు తీవ్రంగా ఒత్తిడి చేస్తున్నారు. చెల్లింపులు ఆలస్యమయ్యే కొద్దీ వేధింపులు తీవ్రం చేస్తున్నారు. రుణ గ్రహీత మొబైల్ నెంబర్లకు పరువు, ప్రతిష్టలకు భంగం కలిగించే పోస్టులతో దుష్ప్రచారాలతో కూడిన సందేశాలు, ఫోటోలు పంపిస్తున్నారు. బెదిరింపులకు లెక్కచేయకపోతే రుణ గ్రహీత కుటుంబ సభ్యుల ఫొటోలను మార్ఫింగ్ చేసి యాప్‌లోని కాంటాక్ట్ నెంబర్‌లోని వాట్సాప్‌లకు పంపుతున్నారు. వీరి ఆగడాలను కొందరు బయటకు చెప్పుకోలేక కుంగిపోతున్నారు. మరి కొందరు బలవన్మరణానికి పాల్పడుతున్నారు. అప్పు తీర్చడానికి కుటంబ సభ్యులతో మాయమాటలు చెప్పి లేదా చోరీలకు సైతం పాల్పడుతున్నారు. ముఖ్యంగా లోన్ యాప్ నిర్వాహకులు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలపై దృష్టి పెడుతున్నారు.





అప్రమత్తతే ప్రధానం



స్మార్ట్ ఫోన్‌లో మనకు తెలియని యాప్‌లు కనిపిస్తే అప్రమత్తంగా ఉండాలి. ప్రతి యాప్‌ను క్లిక్ చేయకూడదు. క్లిక్ చేసామో ఇబ్బందులను కొనితెచ్చుకున్నట్లే. రుణ యాప్‌లలో రుణాలను పొంది మోసపోవద్దు. లోన్ యాప్‌ల జోలికి అసలే పోవద్దు. ఆ యాప్‌ల నిర్వాహకుల నుంచి వేధింపులు ఉంటే పోలీసులకు ఫిర్యాదు చేయండి. హామీ లేకుండా రుణాలు వస్తున్నాయని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆశపడవద్దు. మాయ మాటలు విని మోసపోవద్దు. రుణాల విషయంలో జాగ్రత్తగా ఉండాలి.

– వెంకటేష్, ఎస్సై, కొత్తపల్లి

సమస్యలు పరిష్కరించాలి



కరప తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఆశా కార్యకర్తలు

కరప: కూటమి నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని, కనీస వేతనం చెల్లించాలని, మట్టి ఖర్చులకు రూ. 20 వేలు ఇవ్వాలని మండల ఆశావర్కర్లు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి ఏపీ ఆశా వర్కర్ల యూనియన్ పిలుపు మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద కార్యకర్తలు ధర్నా చేసి, ప్రభుత్వ తీరును నిరసించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.రాజ్ కుమార్ మాట్లాడుతూ ఆశావర్కర్ల జీతాలు పెంచుతామని, ఎవరైనా చనిపోతే మట్టిఖర్చులకు రూ.20 వేలు చెల్లిస్తామని, జనాభా ప్రాతిపదికన వెయ్యి మందికి ఒక ఆశావర్కర్‌గా కొత్త వారిని నియమిస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి 16 నెలలు అయినా ఒక్కహామీని కూడా అమలుచేయలేదన్నారు. ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించకపోతే కలెక్టరేట్ల వద్ద, చలో విజయవాడ వంటి ఆందోళనలు నిర్వహించేందుకు ఆశావర్కర్లు సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ జి.దుర్గాప్రసాద్‌కు అందజేశారు.

వృత్తి శిక్షణ కేంద్రం ప్రారంభం

కాకినాడ రూరల్: నిరుపేద విద్యార్థులకు వృత్తి శిక్షణ అందించి, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కొత్తగా కాకినాడలో ఉన్నతి ఫౌండేషన్ వృతి శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని కెప్టెన్ సుబ్బారావు ప్రభల పేర్కొన్నారు. మండల పరిధిలోని తూరంగిలో మంగళవారం వృత్తి శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ కాకినాడలోని యువతకు వీలైనంత ఎక్కువగా శిక్షణ అందించి ఉద్యోగ అవకాశాలు పొందేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉన్నతి ఫౌండేషన్ డైరెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.